క్లుప్తంగా

రేపటి నుంచి నిరవధిక సమ్మె

సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



సదాశివపేటలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపల్ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.21 వేల వేతనం పెంచడంతోపాటు కాంట్రాక్టు కార్మికులకు పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చౌదరి మనీష్, నాగేష్, రవికుమార్, రాజు, నర్సింలు, శ్రీనివాస్, పాపయ్య, బాలరాజ్, రుక్కమ్మ, మమత, మొగులమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దసరా బోనస్ ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య



మాట్లాడుతున్న రాజయ్య

జిన్నారం(పటాన్‌చెరు): కార్మికులకు దసరా బోనస్‌ను చెల్లించేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఖాజీపల్లి పారిశ్రామిక వాడలో కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. బోనస్ ఇవ్వని పరిశ్రమల వద్ద ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆయా కార్మిక యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న చింతా సాయినాథ్

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ స్వగృహంలో ఆదివారం నియోజకవర్గ పరిధిలోని 31 మంది లబ్ధిదారులకు రూ.9,88,500 విలువగల చెక్కులను బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు చింతా సాయినాథ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, చౌదరి ప్రకాష్, గుండు రవి, కోఆప్షన్ మెంబర్ ఖలీమ్, నాయకులు మొబిన్, నసీర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పందెం కోళ్ల పెంపకం స్థావరాలపై దాడులు



పోలీసుల అదుపులో నిందితులు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోగల శ్రీరాంనగర్ కాలనీలో పందెం కోళ్ల పెంపకం స్థావరాలపై ఎస్‌ఓటీ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో రూ.1.39 లక్షల నగదు, 49 సెల్ ఫోన్లు, ఆరు పందెం కోళ్లు, 53 మంది బెట్టింగ్ రాయుళ్లు, నిర్వాహకులను ఎస్‌ఓటీ ఎస్ఐ రోహిత్‌కుమార్ అదుపులోకి తీసుకున్నారు. బొల్లారం సీఐ నయీముద్దీన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సహాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని 3వ బ్లాక్‌లో నివాసం ఉండే మొయిన్ నివాసంలో అగ్ని ప్రమాదం జరిగింది. బాధితులకు పీఎస్ ఫౌండేషన్ చైర్మన్ బూరుగడ్డ రాకేష్ రాజ్ ఆదివారం నిత్యావసర సరుకులు, రూ.10 వేల నగదు ఆదివారం అందజేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బూరుగడ్డ నగేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిపుత్రుల ఆధ్యాత్మిక బాట

- బల్కంచెల్క తండాలో విశ్వపాళిని (జ్వాలాముఖి) భవానీ సమేత సేవాలాల్ మహరాజు మందిరం
- ఏటా అమ్మవారి దీక్షలు
- దసరా సందర్భంగా దేవీనవరాత్రులు
- ప్రతీనెలా నవచండీ యాగం నిర్వహణ



బల్కంచెల్క తండాలోని విశ్వపాళిని భవానీ మాత, సేవాలాల్ మహరాజు మందిరం

కల్హేర్(నారాయణఖేడ్): సంత్ శ్రీ సేవాలాల్ మహరాజు చూపిన మార్గాన్ని గిరిజనులు అనుసరిస్తున్నారు. నిత్యం ధార్మిక కార్యక్రమాలతో సన్మార్గంలో పయనిస్తున్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటున్నారు. నిజాంపేట మండలం బాచేపల్లి పంచాయతీ పరిధిలోని బల్కంచెల్క తండా ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. తండాలో శ్రీ విశ్వపాళిని(జ్వాలాముఖి) భవానీ సమేత సేవాలాల్ మహరాజు మహామందిరం నిర్మాణంతో తండాకు పేరు ప్రఖ్యాతలు వచ్చాయి. రాష్ట్రంలో బల్కంచెల్క తండాకు భక్తి ధామ్ తండాగా గుర్తింపు వచ్చింది. గిరిజనుల ఆరాధ్య దైవం తపస్వీ రాంరావు మహరాజు స్వయంగా మందిరంలో భవానీ మాత, సేవాలాల్ మహరాజు విగ్రహాలను ప్రతిష్ఠించారు. మేడ్చల్ జిల్లా రవాణా శాఖ అధికారి, మందిరం ధర్మకర్త మూడ్ కిషన్‌సింగ్, లలితాబాయి దంపతుల ఆధ్వర్యంలో భవానీ మాత దీక్షలు చేపట్టారు. దీంతో బల్కంచెల్క తండాతో పాటు నారాయణఖేడ్ ప్రాంతంలోని తండాల్లోనూ ఏటా భవానీ మాత దీక్షలు చేపడుతున్నారు. ప్రతీ రోజు తండాల్లో భోగ్ భండార్, హోమం తదితర పూజా కార్యక్రమలు జరుగుతున్నాయి. బల్కంచెల్క తండా నుంచి మూడ్ కిషన్ సింగ్ నేతృత్వంలో మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లో కొలువైన భవానీ మాత దర్శనం కోసం అమ్మవారి భక్తులు పాదయాత్ర చేస్తారు. ఏటా అమ్మవారి దీక్షలు చేపట్టేందుకు గిరిజనులు తండాబాట పడుతున్నారు. దసరా పండగ సందర్భంగా బల్కంచెల్క తండాలో దేవీనవరాత్రులు నిర్వహించడం ఆనవాయితీ. ఈనెల 21వ తేదీన బల్కంచెల్క తండాలో భవానీ మాత దీక్షదారుల పడిపూజకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతీనెల నవచండీ యాగం నిర్వహిస్తున్నారు.



మందిరంలో కొలువుదీరిన సేవాలాల్ మహరాజు



భవానీ మాత

మంత్రులు, కవులు కళాకారుల రాక

బల్కంచెల్క తండాలో ఆధ్యాత్మిక కార్యక్రమలు జరుగుతుండటంతో మంత్రులు, కళాకారులు మందిరాన్ని సందరిస్తున్నారు. రాష్ట్ర మంత్రులు హరీశ్ రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ బీబీపాటీల్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తున్న కలెక్టర్ చంద్రకళ, రాష్ట్ర కలెక్టర్లు దినకర్‌బాబు, స్మీతా సబర్వాల్, హన్మంత్‌రావు, కవులు నందిని సిధారెడ్డి, నిజామాబాద్‌కు చెందిన కవి ఘనపూరం దేవేందర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సన్మార్గంలో నడుస్తున్నారు

మందిరం నిర్మాణంతో తండా ఆధ్యాత్మిక కేంద్రంగా విరజిల్లుతోంది. తండావాసులు క్రమశిక్షణ అలవర్చుకున్నారు. చెడు వ్యసనాలు వదిలిపెట్టారు. గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవలాల్ మహరాజు మార్గం అనుసరిస్తున్నాం. మందిరం వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమలు నిర్వహిస్తాం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివస్తారు.

– మూడ్ కిషన్‌సింగ్, మందిరం ధర్మకర్త

ఆత్మగౌరవ సభకు తరలివెళ్లిన ముదిరాజులు



ఆత్మగౌరవ సభకు వెళ్తున్న ముదిరాజులు

వట్‌పల్లి(అందోల్): తెలంగాణ ముదిరాజ్ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ముదిరాజుల ఆత్మగౌరవ నిర్వహించారు. సభకు వట్‌పల్లి, అల్లాదుర్గం, టేక్మాల్ తదితర మండలాల నుంచి జోగిపేటకు చేరుకొని అక్కడ నుంచి వాహనాలలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగభూషణం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ముదిరాజులను రాజకీయంగా అణిచివేస్తున్నారని జనాభా ప్రతిపాదికన అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజులకు టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

యువత క్రీడల్లో సత్తా చాటాలి

గజ్వేల్‌రూరల్: యువత క్రీడల్లో రాణించి సత్తా చాటాలని గజ్వేల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బెండ మధు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సింగాటంలో ప్రభుత్వం నుంచి వచ్చిన స్పోర్ట్స్ కిట్‌లను క్రీడాకారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ధారుఢ్యం పెరుగుతుందన్నారు. యువత తమలోని ప్రతిభను చాటుతూ క్రీడల్లో రాణించాలని, ఉన్నత స్థానంలో నిలిచినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్‌చారి, బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, స్వామి, నరేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌కు వచ్చిన ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బయ్యారం సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. దూల్మిట్ట సర్పంచ్ దుబ్బు దీపిక వేణుగోపాల్‌రెడ్డిని కలిసేందుకు ఎమ్మెల్సీ ఆదివారం గజ్వేల్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ మల్లేశం, బయ్యారం సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు కొలిచెలిమి కుమార్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు పంగ మోహన్‌బాబు పాల్గొన్నారు.

గ్రీన్ పార్క్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శంతన్ గ్రీన్ పార్క్‌లో ఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు అంజిరెడ్డి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆదివారం వీటిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శంతన్ గ్రీన్ పార్క్‌లో 300 కుటుంబాలు నివసిస్తున్నాయని, ఈ కాలనీ పట్టణానికి చివరగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలను జరుగుతున్నాయన్నారు. అటువంటివి జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పటాన్‌చెరు అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అదెల్లి రవీందర్, అమీన్‌పూర్ అధ్యక్షుడు ఆగారెడ్డి, రామచంద్రాపురం డివిజన్ ప్రధాన కార్యదర్శి బలరాం, భారతీనగర్ డివిజన్ ఉపాధ్యక్షురాలు గీత తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాల మానిటరింగ్ గదిని ప్రారంభిస్తున్న గోదావరి అంజిరెడ్డి

బీఆర్ఎస్‌లో యువతకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఇసుక బావి, వందనపురి కాలనీలకు చెందిన యువకులు పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగు శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకుడు ఏనుగు నందివర్ధన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అంకిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే అభివృద్ధి సాధ్యం



బొల్లారంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): నిజామాబాద్‌కు పసుపు బోర్డు మంజూరు చేసినందుకు మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో ఆదివారం పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పీఎం మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. కేంద్ర నిధులతో తెలంగాణలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రైతుల అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోదీ ఇచ్చిన మాట మేరకు నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మోదీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

సంగారెడ్డి: సీఎం కేసీఆర్ కృషితో కాలనీలు అభివృద్ధి చేసుకున్నామని చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని 32వ వార్డులో రూ.60 లక్షలతో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

మార్షల్ ఆర్ట్స్‌తో అనేక లాభాలు



పోటీలను తిలకిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నర్సాపూర్: మార్షల్ ఆర్ట్స్‌తో ఆరోగ్యంగా ఉండడంతో పాటు స్వీయ రక్షణకు అవకాశం ఉంటుందని వుషు మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేశ్ అన్నారు. ఆదివారం జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో జిల్లా స్థాయి వుషు మార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించి, క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెలలో మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ పూర్ణచందర్ తెలిపారు. కాగా అండర్ 17 విభాగంలో పది మంది బాలికలు, బాలురు, అండర్ 19 విభాగంలో పది మంది బాలికలు, పది మంది బాలురను ఎంపిక చేశామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్, పీఈటీలు పూర్ణచందర్, విజేత, సతీశ్, సాయికృష్ణ, పోచయ్య, వినోద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

గజ్వేల్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలం అనంతరావుపల్లిలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రాతినిధ్యం కారణంగా గజ్వేల్ నియోజకవర్గం అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిచిందని చెప్పారు. అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. కమ్యూనిటీ భవనాల నిర్మాణంతో మంచి సౌకర్యం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు బెండ మధు, సర్పంచ్ దాసరి మహేందర్, నాయకులు రమేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



బీసీ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్

ఉన్నత చదువులు చదవాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉద్యోగం చేస్తూ ఉన్నత చదువులు చదువుకోవాలని సిద్దిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఎంఎస్ఎన్ ల్యాబ్ సౌజన్యంతో మంత్రి హరీశ్‌రావు సహకారంతో జాబ్ మేళాను నిర్వహించారు. సిద్దిపేట నియోజకవర్గాన్ని మంత్రి రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతున్నారన్నారు. ఐటీ టవర్ ద్వారా 700 మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. జాబ్ మేళాకు 200పైగా అభ్యర్థులు హాజరు కాగా 38 మంది ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు



మునిపల్లి(అందోల్): ప్రతీ గ్రామంలో అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సహకారంతో సీసీ రోడ్లు నిర్మిస్తామని జెడ్పీటీసీ మీనాక్షి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన మునిపల్లి గ్రామంలో బతుకమ్మ చీరల పంపిణీ, సీసీ రోడ్ల పనులను సర్పంచ్ రమేశ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్, ఆనంద్, శివశంకర్ పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రణాళికా బద్ధంగా చదివి పదిలో విద్యార్థులు మంచి జీపీఏ సాధించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు భాస్కర్‌రెడ్డి, సిద్దిలింగయ్యస్వామి, తిరుపతి రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని న్యాల్‌కల్, హత్నూర్, చినిగెపల్లి, ఇబ్రహీంపూర్, హుమ్నాపూర్, తాట్‌పల్లి, టేకూర్ గ్రామాల్లో పర్యటించారు. పదో తరగతి విద్యార్థులకు మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గం చీఫ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ అందజేసిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.



◆ దోబీ ఘాట్ నిర్మాణానికి శంకుస్థాపన



జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఊట్లలో దోబీ ఘాట్ నిర్మాణం చేపట్టారు. ఆదివారం వైస్ ఎంపీపీ గంగు రమేశ్, సర్పంచ్ ఆంజనేయులు, ఉపసర్పంచ్ రవి, మాజీ సర్పంచ్ శివరాజ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణం త్వరగా పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు.

◆ నగర సంకీర్తన



జహీరాబాద్ టౌన్: పట్టణంలో రాధాకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నగర సంకీర్తన నిర్వహించారు. నగర సంకీర్తనలో భక్తులు భజనలు చేస్తూ కీర్తనలు ఆలపించారు. రెండేళ్లుగా నగర సంకీర్తన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, పట్టణ ప్రముఖులు, వైద్యులు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌లో చేరిక

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలంలోని గిరిజన నాయకులు ఆదివారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దర్మురాథోడ్, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు మోహన్ చౌవాన్ ఆదివారం మాజీ మంత్రి, నియోజకవర్గం చీఫ్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసేవారికి తగిన గుర్తింపు, సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



◆ బెల్ట్ షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు

పటాన్‌చెరు టౌన్: బెల్ట్ షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పటాన్ చెరు సీఐ లాలూ నాయక్ హెచ్చరించారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని వడ్డెర కాలనీలో హనుమంతు తన కిరాణా దుకాణంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నాడని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఆదివారం సాయంత్రం సోదాలు నిర్వహించి 47 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

◆ వాల్ పోస్టర్ విడుదల

రాయికోడ్(అందోల్): మండలంలోని ధర్మాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల వాల్ పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు ఆదివారం విడుదల చేశారు. ఆరు గ్యారంటీలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బి.నర్సింలు, రాయికోడ్ సర్పంచ్ కేదారినాథ్ పాటిల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

◆ మంత్రి పర్యటన విజయవంతం



శివకుమార్

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు జహీరాబాద్ పర్యటన విజయవంతమైందని డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శివకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జహీరాబాద్, ఝరాసంగం, కోహీర్ మండలాల్లో మంత్రి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గంలో అదనంగా 2 వేలు గృహలక్ష్మీ ఇళ్లను మంజూరుకు హామీ ఇచ్చారన్నారు. మంత్రి పర్యటన విజయవంతానికి కృషి చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.